క్లుప్తంగా

గుర్రపు డెక్క తొలగింపునకు చర్యలు



సాక్షి ఎఫెక్ట్

పామర్రు: సాక్షి దిన పత్రికలో ఈ నెల రెండో తేదీన ప్రచురితమైన 'గుర్రపు డెక్క తొలగించరా?' అనే కథనానికి ఇరిగేషన్ అధికారుల స్పందించారు. దగ్గుమిల్లి చానల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపు చర్యలు చేపట్టారు. డెక్కను తొలగించేందుకు కెమికల్ స్ప్రేను చల్లారు. రెండు రోజుల్లో గుర్రపు డెక్క తొలగిపోతుందని ఇరిగేషన్ జేఈఈ సాధిక్ తెలిపారు.

విజేతలకు ఒక్కొక్కరికి రూ.1,000

గుడివాడ టౌన్: అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో శనివారం నిర్వహించిన పద్యం, గేయం, వచనా కవిత, మినీ కవిత పోటీల్లో గుడివాడకు చెందిన వసుధ బసవేశ్వరరావు మినీ కవిత్వం, కె. లీలా కృష్ణ వచనా కవిత, సింగరాజు శ్రీనివాసరావు గేయం, సూర్యదేవర రవికుమార్ పద్యం విభాగాల్లో విజేతలుగా నిలిచారు. విజేతలకు ఒక్కొక్కరికి రూ.1,000 బహుమతితో పాటు సోమవారం గుంటూరులో జరిగే అవినీత వ్యతిరేక కవితా సమ్మేళనంలో సత్కారం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా సెమీ క్రిస్మస్



గుడివాడ టౌన్: స్థానిక ఎన్టీఓస్ హోమ్‌లో మాదిగ బంధువుల ఉప కులాల ఉత్సవ్ మిలాప్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ ముఖ్య అతిథిగా విచ్చేసి సెమీ క్రిస్మస్ వేడుకలు ప్రారంభించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ నాయకులు సుధాకర్, నాగబాబు, సైమన్ పాల్గొన్నారు.

పెదమద్దాలి వీఆర్వో సస్పెన్షన్

పామర్రు: మండలంలోని పెదమద్దాలి వీఆర్వో కె.ప్రదీప్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ నుంచి ఉత్తర్వులు వచ్చాయని తహసీల్దార్ రవికాంత్ ఆదివారం తెలిపారు. ధాన్యం కొనుగోళ్ల విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని ఓ రైతు సీఎం చంద్రబాబుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీఆర్ఓపై సమగ్ర విచారణకు కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. విచారణ నివేదిక ఆధారంగా వీఆర్వోను కలెక్టర్ సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా దంత వైద్యం



గుడివాడ టౌన్: స్థానిక ఏలూరు రోడ్‌లోని రవి డెంటల్ సెంటర్ వైద్యుడు డాక్టర్ మలిరెడ్డి రవి రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా దంత సేవలు అందించినట్లు రోటరీ క్లబ్ గుడివాడ అధ్యక్షుడు టీఎస్ రాజశేఖర్ తెలిపారు. గతంలో ప్రణవాశ్రమ విద్యార్థులకు దంతవైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో ఐదుగురికి చికిత్సలు అవసరమయ్యాయని వారికి ఈ డెంటల్ సెంటర్‌లో రూ. 10వేలు విలువ గల వైద్యాన్ని ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాస్ట్ ప్రెసిడెంట్ రావి శ్రీహర్ష, క్లబ్ కార్యదర్శి జి.కిరణ్‌బాబు, కార్యవర్గ సభ్యులు జి.నరేష్, ఎస్. వరప్రసాద్, బి.జ్యోతీశ్వరరావు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు

గుడ్లవల్లేరు: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల నమోదు సోమవారంతో ముగియనున్నట్లు తహసీల్దార్ బి.లోకరాజు ఆదివారం విలేకరులకు తెలిపారు. అర్హులైన దరఖాస్తుదారులు ఫారం –18ను పూర్తి చేసి తమ కార్యాలయంలో అందజేయాలని ఆయన కోరారు.

నేడు మాలల జేఏసీ సమావేశం

గుడివాడ టౌన్: మాలమహానాడు, మాల ఉప కులాలు వర్గీకరణ వ్యతిరేకవాదుల జేఏసీ సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు పొంగులేటి జయరాజు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని రాజేంద్రనగర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో సాయంత్రం ఐదు గంటలకు ఈ సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 15వ తేదీన గుంటూరు నల్లపాడురోడ్ హౌసింగ్ కాలనీలో నిర్వహించనున్న సభను జయప్రదం చేసేందుకు గాను ఈ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

సమస్యల వలయంలో ప్రభుత్వాస్పత్రులు

- ఆగిపోయిన కళ్లజోళ్ల పంపిణీ
- శిథిలావస్థకు చేరిన మండవల్లి పీహెచ్‌సీ
- కైకలూరులో ఆక్సిజన్ ప్లాంటు వృథా

> ప్రభుత్వాస్పత్రుల్లో సమస్యలు తిష్టవేశాయి. ఆస్పత్రుల పనితీరుపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడంతో సేవలు సక్రమంగా అందక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో మెరుగైన సేవలందించిన ఆస్పత్రులు ప్రస్తుతం మౌలిక వసతుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి.

కైకలూరు: నియోజకవర్గంలోని ప్రభుత్వాస్పత్రులు వసతులు లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. వైద్యం కోసం వెళ్లే పేదలకు సరైన చికిత్స అందక ఇబ్బందులుపడుతున్నారు. పలు ఆస్పత్రుల్లో ఉచిత కళ్లజోళ్ల పంపిణీ అటకెక్కింది. బాలింతలకు భోజనాలు అందించలేని స్థితిలోకి వచ్చాయి. అత్యవసర పరిస్థితుల్లో సైతం రక్త నిల్వలు నిండుకుంటున్నాయి. ప్రభుత్వాస్పత్రుల తీరుపై సామాన్యులు పెదవి విరుస్తున్నారు.

కైకలూరు నియోజకవర్గంలో కైకలూరులో కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)తో పాటు శీతనపల్లి, కొల్లేటికోట, కలిదిండి మండలంలో మూలలంక, కలిదిండి, కోరుకొల్లు, మండవల్లి మండలంలో మండవల్లి, లోకుమూడి, ముదినేపల్లి మండలంలో దేవపూడి, గురజ, ముదినేపల్లి పీహెచ్‌సీలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో మండవల్లి పీహెచ్‌సీ శిథిలావస్థకు చేరింది. చిన్నపాటి వర్షం కురిసినా నీటి మడుగులా మారుతోంది. ఇన్‌చార్జి డాక్టర్ విధులు నిర్వహిస్తున్నారు. బీ–12 మాత్రలు అందుబాటులో లేవు. పెచ్చులూడుతున్న ఆస్పత్రిలో భయంభయంగా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.



శిథిలావస్థకు చేరిన మండవల్లి పీహెచ్‌సీ

ఆక్సిజన్ ప్లాంట్ వృథా

కోవిడ్ మహమ్మారిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి వైఎస్సార్ సీపీ పాలనలో దాతల సాయంతో రూ.కోటి నిధులు వెచ్చించి కైకలూరు సీహెచ్‌సీలో ఆక్సిజన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దాన్ని పట్టించుకోకపోవడంతో విలువైన పరికరాలు తుప్పుపట్టాయి.



కైకలూరు సీహెచ్‌సీలో నిరుపయోగంగా మారిన రూ.కోటితో నిర్మించిన ఆక్సిజన్ ప్లాంటు

తగ్గిన రోగుల సంఖ్య

సీహెచ్‌సీలో గత పాలనలో కంటి పరీక్షలు చేసి ఉచిత కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో కళ్లజోళ్లు అందించకపోవడంతో రోగులు సగానికి సగం తగ్గారు. బాలింతలకు, రోగులకు డైట్ ఫుడ్ సీహెచ్‌సీలో అందుబాటులో లేదు. ప్రధానంగా పిల్లల డాక్టర్ నియామకం జరగలేదు. సీహెచ్‌సీలో కొన్ని బాత్‌రూమ్‌లకు చెదలు పట్టి తలుపులు ఊడిపోయాయి. అదేవిధంగా ఎంఎల్‌ఓ, ఎఫ్‌ఎల్‌ఓల కొరత ఉంది.

గొంతు నొప్పి తగ్గలేదు



గొంతు నొప్పి వచ్చి మండవల్లి పీహెచ్‌సీకి వెళ్లాను. నాకు ఓ టానిక్ ఇచ్చారు. ఇంటికి తీసుకువెళ్లి వాడినా తగ్గలేదు. మళ్లీ వస్తే కైకలూరులో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వెళ్లమని సూచించారు. వర్షం వస్తే మండవల్లి పీహెచ్‌సీకి వెళ్లలేని పరిస్థితి ఉంది.

– బి.యోహాను, గొల్లగూడెం

వర్షం వస్తే ఇబ్బంది



రోగులకు ఎలాంటి వ్యాధి వచ్చినా చికిత్స చేస్తున్నాం. 2000వ సంవత్సరంలో పీహెచ్‌సీ నిర్మించారు. పీహెచ్‌సీ ప్రాంగణంలో వర్షం నీరు నిలవడంతో పీహెచ్‌సీ చుట్టూ ఉన్న గోడలు దెబ్బతిన్నాయి. లోపల ఫ్లోరింగ్ కూడా పాడైపోయింది. సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

– సీహెచ్ శ్రీనివాసరావు, సీహెచ్‌ఓ, పీహెచ్‌సీ, మండవల్లి

పిల్లల డాక్టర్ పోస్టు ఖాళీగా ఉంది

సిబ్బంది నియామకాలకు త్వరలో నోటిఫికేషన్ విడుదలవుతుందని భావిస్తున్నాం. పిల్లల డాక్టర్ పోస్టు ఇక్కడ ఖాళీగా ఉంది. మిగిలిన డాక్టర్లు అందరూ రోగులకు సక్రమంగా వైద్య సేవలు అందిస్తున్నారు.

– డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, కైకలూరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్

పెద్దింట్లమ్మా.. చల్లని దీవెనలు ఇవ్వమ్మా



కైకలూరు: పెద్దింట్లమ్మ తల్లీ.. నీ చల్లని దీవెనలు మాపై కురిపించమ్మా.. అంటూ కొల్లేటికోట పెద్దింట్లమ్మను భక్తులు వేడుకున్నారు. ఏలూరు, కృష్ణ, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పవిత్ర కోనేరులో స్నానాలు ఆచరించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక భోజనాలు చేశారు. ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కొండలమ్మ సన్నిధిలో భక్తుల సందడి



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఏర్పాట్లు చేశారు.

షష్ఠి సంబరాలకు పోటెత్తిన భక్తులు



నాగబంధాల వద్ద మహిళలు పూజలు



స్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాగిత

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామికి ఆదివారం ప్రీతికరమైన రోజు కావడంతో అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులు ఆలయంలోని పుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకున్నారు. పాలపొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారు చేసి స్వామికి సమర్పించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. సోమవారం రాత్రి స్వామి కల్యాణ రథయాత్ర నిర్వహిస్తామని సహాయ కమిషనర్ తెలిపారు. స్వామివారిని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ దర్శించుకుని పూజలు చేశారు. ఆయనకు సహాయ కమిషనర్ ఆర్ గంగా శ్రీదేవి స్వామివారి చిత్రపటం అందజేసి సత్కరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

పమిడిముక్కల: మండలంలోని తాడంకి జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. 1982–83, 1991–92కు సంబంధించి 10వ తరగతి బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు వేర్వేరుగా ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకుని, గత స్మృతులను నెమరు వేసుకుంటూ, తరగతి గదుల్లో కలియ తిరుగుతూ ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. వచ్చే ఏడాది జనవరి 12వ తేదీన జరిగే పాఠశాల శతాబ్ది వేడుకల్లో పూర్వ విద్యార్థులంతా పాల్గొని జయప్రదం చేయాలని శతాబ్ది ఉత్సవ కమిటీ కార్యదర్శి యేనుగ మస్తాన్‌రావు కోరారు.

చదువులో రాణిస్తేనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యం



మనస్వి, ఆమె తల్లిదండ్రులను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే డీఎన్నార్, డాక్టర్ దుట్టా

హనుమాన్‌జంక్షన్ రూరల్: చదువులో రాణించినప్పుడే సామాజిక, ఆర్థిక, రాజకీయంగా కాపు వర్గీయుల అభివృద్ధి సాధించగలరని పలువురు వక్తలు అన్నారు. స్థానిక విజయవాడరోడ్డులోని దుట్టా కృష్ణామూర్తి బృందావన్ గార్డెన్స్‌లో హనుమాన్‌జంక్షన్ పట్టణ, బాపులపాడు మండల కాపు వనసమారాధన ఆదివారం జరిగింది. ముఖ్య అతిథులుగా ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ (చంటి), కైకలూరు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఏపీఆర్ ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, అను హాస్పిటల్స్ అధినేత డాక్టర్ గాజుల రమేష్, సినీ నటుడు పృథ్వీరాజ్, ప్రముఖ వైద్యుడు దుట్టా రామచంద్రరావు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ కాపు సామాజికవర్గం ఐకమత్యంగా మెలగాలని సూచించారు. అనంతరం టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో 599 మార్కులతో స్టేట్ ఫస్ట్ సాధించిన ఆకుల వెంకట నాగసాయి మనస్వి, ఆమె తల్లిదండ్రులను సత్కరించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎం.కోటేశ్వరరావు, ఏపీ తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ లావేటి శ్రీనివాసరావు, ఏపీ నాటక అకాడమీ మాజీ డైరెక్టర్ గాంధీ, ముసునూరు ఎంపీపీ కొండా పద్మ, శేరినరసన్నపాలెం సర్పంచ్ అంజిబాబు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్షలు

గుడివాడ టౌన్: కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల ప్రోత్సాహం కోసం నిర్వహిస్తున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షలు ఆదివారం పట్టణంలో ప్రశాంతంగా జరిగాయి. 8వ తరగతి విద్యార్థులు పాల్గొనే ఈ అర్హత పోటీల్లో పట్టణంలోని ఎస్‌పీఎస్ హైస్కూల్లో 130 మంది, ఏజీకే హైస్కూల్లో 177 మంది, ఏకేటీపీ బాలికల పాఠశాల్లో 169 మంది, ఆంధ్ర నలంద మున్సిపల్ హైస్కూల్లో 175 మంది, మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో 174 మంది, గాంధీ మున్సిపల్ హైస్కూల్లో 167 మంది పరీక్షకు హాజరయ్యారు.

640 మందికి వైద్య పరీక్షలు



గుడ్లవల్లేరు: ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు వైద్య శిబిరంలో ఆదివారం ఉచిత వైద్య పరీక్షలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 640 మంది రోగులకు వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

ఉచిత మధుమేహ వైద్య పరీక్షలు

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు గుడివాడకు చెందిన వైద్యురాలు గవిర్నేని రజనీ వైద్య పరీక్షలు చేశారు. దాతలు గంగాధరరావు(వెస్టిండీస్), కొసరాజు బాపయ్యచౌదరి, వల్లభనేని రామకృష్ణ ఆర్థిక సాయంతో నిర్వహించిన ఈ శిబిరంలో 165 మందికి పరీక్షలు జరిగాయని లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు.

అన్నసమారాధన



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భక్తులు స్వామిని దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకటకృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు.

ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించుకోవాలి



వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా దంపతులు

నిమ్మకూరు(పామర్రు): ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని నిమ్మకూరులోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని ఎమ్మెల్యే దంపతులు సందర్శించారు. ఆలయంలో ఎమ్మెల్యే విశేష పూజలను చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో మచిలీపట్నం జొన్నలగడ్డ మాధవి ఆధ్వర్యంలో శ్రీ దత్త కృష్ణ గీతా పారాయణ బృందం నిర్వహించిన గీతాపారాయణ బాగుందన్నారు. అనంతరం ఆలయ అర్చకులు సుదర్శనం యోగానంద లక్ష్మీ నరసింహాచార్యులు ఎమ్మెల్యేను సత్కరించారు. జనసేన పార్టీ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, నాయకుడు ప్రవీణ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

గుడివాడ టౌన్: ఆలయాల పరిరక్షణ కోసం విశ్వ హిందూ పరిషత్ నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆర్ఎస్ఎస్ విజయవాడ ప్రముఖ్ పాకాల త్రినాథ్ అన్నారు. స్థానిక సత్యనారాయణపురంలోని ఆదివారం ఉపద్రష్ట సత్రం నందు బహిరంగ సభల బ్రోచర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరి ఐదో తేదీన కేసరపల్లిలో విశ్వ హిందూ పరిషత్ మహాసభను నిర్వహిస్తున్నారన్నారు. హిందూ ఆలయాల పరిరక్షణ, హైందవ సంస్కృతి, సంప్రదాయాల కొనసాగింపు ముఖ్య ఉద్దేశంగా నిర్వహిస్తున్న ఈ సభలో హిందువులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ గుడివాడ అధ్యక్షురాలు జేవీవీ కుమారి, శ్రీదేవి, పి.రవికుమార్, కె.శ్యామ్‌సుందర్, ఎం.శ్రీధర్, వై.అర్జున్, అంగడాల సతీష్, సానా వాసు, సూరే గాంధి, భవాని, శ్రీనివాస్ పాల్గొన్నారు.



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న విశ్వ హిందూ పరిషత్ నాయకులు

ఐక్య వేదిక అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



మండవల్లి: ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక మండల అధ్యక్షుడిగా గంజాల శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. స్థానిక మండల పరిషత్ స్కూల్లో రాష్ట్ర ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక నాయకుడు ఎల్ఎస్.భాస్కరరావు ఆధ్వర్యంలో ఆదివారం ఈ ఎన్నికలను నిర్వహించారు. గౌరవాధ్యక్షులుగా సుధాబత్తుల విజయకుమార్, బండారువెంకయ్య, బండి రంగారావు, ప్రధానకార్యదర్శిగా కుందేటి అర్జునరావు, ఉపాధ్యక్షులుగా ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, బోన నాగరాజ. కార్యదర్శులుగా వెలకపల్లి బేబీ సరోజిని, వరద శ్యామ్, పొన్నూరు రామచంద్రరావు, కోశాధికారిగా టి.అప్పారావు, కార్యవర్గ సభ్యులుగా గుడివాడ గణేష్, ఈలి జ్యోతి, కె.మార్కురాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఆటపాక పక్షుల కేంద్రంలో పర్యాటకుల సందడి



ఆటపాక పక్షుల కేంద్రం చిల్డ్రన్స్ పార్కు వద్ద పర్యాటకులు

కైకలూరు: పర్యాటకులతో ఆటపాక పక్షుల కేంద్రం ఆదివారం సందడిగా మారింది. సమీప జిల్లాల నుంచి పెద్ద ఎత్తున పక్షి ప్రేమికులు విచ్చేశారు. బోటు షికారు చేస్తూ పెలికాన్, పెయింటెడ్ స్టార్క్ పక్షుల కేరింతలను దగ్గరుండి తిలకించారు. శీతాకాల వలస పక్షులు సంతానోత్పత్తి కోసం గూళ్లు కట్టుకుంటున్నాయి. ఈ దృశ్యాలు పర్యాటకులను మరింతగా కట్టిపడేస్తున్నాయి. సమీప చిల్డ్రన్స్ పార్కులో చిన్నారులు ఆటలాడుకున్నారు. అటవీశాఖ సిబ్బంది కొల్లేరు భౌగోళిక పరిస్థితులు, విదేశీ, స్వదేశీ పక్షులు విశేషాలను పర్యాటకులకు వివరించారు.



పర్యాటకుల బోటు షికారు

మబ్బులతో రైతన్న గుండెల్లో రైళ్లు



కట్టేతలు కడుతున్న కూలీలు



పొలం గట్లపై కట్టలు తీసుకొస్తున్న మహిళలు



కుప్ప వేస్తున్న కూలీలు

గుడ్లవల్లేరు మండలంలో మబ్బులు పట్టడంతో రైతన్న గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. ఆదివారం రైతులు పొలాల వైపు పరుగులు తీశారు. పనలపై ఉన్న వరి పైరును కాపాడుకునే అవకాశం లేక కొందరు మిన్నకుండిపోయారు. కోతలు, కట్టేతలు, కుప్ప నూర్పిళ్లు రెట్టింపు కూలి ధరలతో చేపట్టారు. యుద్ధప్రాతిపదికన కుప్పలు వేసేశారు. పరదాలను కప్పి కుప్పలను కాపాడుకునేందుకు ఎన్నో వ్యయప్రయాసలకూర్చారు.

– గుడ్లవల్లేరు